సాక్షి కర్నూలు

ఆదివారం ၊ 4 ၊ జూన్ ၊ 2023



వైభవంగా శ్రీగిరి ప్రదక్షిణ

శ్రీశైలంటెంపుల్: పౌర్ణమి సందర్భంగా శనివారం సాయంత్రం శ్రీశైల గిరిప్రదక్షిణ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ లవన్న, భక్తులు పాల్గొన్నారు.



మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళావేదికపై గుంటూరుకు చెందిన భరణి కూచిపూడి నృత్య కళాశాల వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



కేజీబీవీలకు తీపి కబురు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 53 కస్తూర్బా గాంధీ విద్యాలయాలు ఉన్నాయి. వీటిలో 202 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిపై భర్తీ చేయనున్నారు. అర్హులైన వారు 5లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. 10లో

న్యూస్‌రీల్

తగ్గని ఉష్ణోగ్రతలు

- చాగలమర్రిలో 44.52.. మంత్రాలయంలో 44.05 డిగ్రీలు

కర్నూలు(అగ్రికల్చర్): ఎండల తీవ్రత తగ్గడం లేదు. జూన్ 1 నుంచి వానాకాలం మొదలవుతుంది. ఎండల తీవ్రత తగ్గాలి. సాధారణంగా ఉష్ణోగ్రతలు ఈ సమయంలో 40 డిగ్రీల వరకు మాత్రమే నమోదు కావాల్సి ఉంది. కానీ 44 డిగ్రీలకుపైగా నమోదు అవుతుండటం గమనార్హం. జిల్లా నిప్పుల కుంపటిగా తయారైంది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో నంద్యాల జిల్లా చాగలమర్రిలో 44.52 డిగ్రీలు, కర్నూలు జిల్లా మంత్రాలయంలో 44.05 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆలూరులో 43.96, దొర్నిపాడులో 43.83, మహానందిలో 43.74, నందికొట్కూరు మండలం బొల్లవరంలో 43.17 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వర్షాలు పడేవరకు ఉష్ణోగ్రతలు ఎక్కువగానే ఉండే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

డీఈఓ వెబ్‌సైట్‌లో తుది సీనియారిటీ జాబితా

కర్నూలు సిటీ: జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్స్(తెలుగు, కన్నడ, ఉర్దూ)గా పని చేస్తున్న వారికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించేందుకు తుది సీనియారిటీ జాబితాను డీఈఓ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ రంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితాపై ఇటీవలే అభ్యంతరాలను స్వీకరించి తుది జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

రేపు కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు కల్చరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా ఈనెల 5న సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ప్రారంభం

- మొదటిరోజు 80.92 శాతం హాజరు

కర్నూలు (సెంట్రల్): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. నగర శివారులోని ఇంజినీరింగ్ కాలేజీలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మొదటి రోజు 545 మందికి గాను 441 మంది (80 శాతం) హాజరైనట్లు జిల్లా కో ఆర్డినేటర్ ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం తప్ప 10వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నట్లు ఆయన వివరించారు.

నేడు 'జేఈఈ అడ్వాన్స్‌డ్'

- ఉమ్మడి జిల్లాలో పరీక్ష రాయనున్న 456 మంది విద్యార్థులు

కర్నూలు (సిటీ): జాతీయ స్థాయిలో ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ఆదివారం నిర్వహించనున్నారు. జేఈఈ మెయిన్స్‌లో అర్హత సాధించిన ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన 456 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాయనున్నారు. కర్నూలు నగరంలోని నందికొట్కూరు రోడ్డులో ఉన్న అయాన్ డిజిటల్ సెంటర్‌ను పరీక్ష కేంద్రంగా ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులు తమ వెంట హాల్‌టికెట్, ప్రభుత్వం జారీ చేసిన ఫొటోతో కూడిన ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలి. అరగంట ముందుగానే కేంద్రాల్లోకి విద్యార్థులకు అనుమతిస్తారు.

డీఎస్‌ఓగా ఆచార్యులు

కర్నూలు (సెంట్రల్): డిస్ట్రిక్ట్ సివిల్ సప్లయ్ ఆఫీసర్‌గా ఆచార్యులు నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం నంద్యాల జిల్లా డీఎస్‌ఓగా పనిచేస్తున్నారు. అక్కడి నుంచి ఇక్కడికి సాధారణ బదిలీల్లో నియమించారు. ఇక్కడ డీఎస్‌ఓగా పనిచేస్తున్న రాజా రఘువీర్‌ను తిరుపతి జిల్లా డీఎస్‌ఓగా పంపారు. అనంతపురంలో ఏఎస్‌ఓగా పనిచేస్తున్న జగన్ మోహన్‌రావును నంద్యాల జిల్లా డీఎస్‌ఓగా నియమించారు.

వదలనంటున్న అఖిల.. ఉపేక్షించనంటున్న ఏవీ!

టీడీపీలో అరాచక నేతలు

- మాజీ మంత్రి అఖిలప్రియ, ఏవీ సుబ్బారెడ్డి మధ్య తీవ్రస్థాయి విభేదాలు
- ఫ్యాక్షన్‌కు ఆజ్యం పోస్తున్న భూమా విఖ్యాత్ వ్యాఖ్యలు
- ప్రశాంతమైన ఆళ్లగడ్డలో మళ్లీ గొడవలు సృష్టించే వైఖరి
- 2019లో అధికారం కోల్పోయిన రోజు నుంచి తరుచూ వివాదాల్లో అఖిల
- భూమా బ్రహ్మానందరెడ్డితో పాటు దూరమైన బంధువర్గం



యువగళం పాదయాత్రలో మే 16న టీడీపీ నేత ఏవీ సుబ్బారెడ్డిపై అఖిల, తన అనుచరవర్గం భౌతికదాడి చేశారు. అఖిల దగ్గరుండి కొట్టండి.. తన్నండి అని రెచ్చగొడుతూ దాడికి పురిగొల్పారు. దాడిలో ఏవీకి రక్తగాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి అఖిలపై కేసు నమోదైంది. రిమాండ్‌కు వెళ్లొచ్చారు. ఈ ఘటన నంద్యాలతో పాటు ఆళ్లగడ్డ టీడీపీలో కలకలం రేపింది.

"నాపై హత్యకు సుపారీ ఇచ్చింది. ఇప్పుడు దాడి చేసింది. ఇన్ని రోజులు పిల్లోళ్లు ఎత్తుకుని పెంచాం ఎందుకులే అనుకున్నా. ఇంత వరకూ వచ్చిన తర్వాత ఇక ఉపేక్షించే ప్రసక్తే లేదు. ఏం జరుగుతుందో కాలమే నిర్ణయిస్తుంది."
– ఈ నెల 31న విలేకరుల సమావేశంలో ఏవీ సుబ్బారెడ్డి





"కొడకల్లారా దాక్కోండి. గుళ్లోకెళ్లి మొక్కోండి. మీ ఖర్మకాలి టీడీపీ అధికారంలోకి వస్తే ఏ మూలన దాక్కున్నా వెంటపడి వస్తాం. వెతుక్కుంటూ వస్తాం. శోభానాగిరెడ్డి రాజకీయం చూపిద్దామనుకున్నా. వీళ్లకి భూమా నాగిరెడ్డి రాజకీయమే కావాల. కచ్చితంగా నాగిరెడ్డి రాజకీయమే చూపిస్తా!"
– ఆళ్లగడ్డ యువగళం సభలో భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి

... ఈ మూడు అంశాలను పరిశీలిస్తే నంద్యాల, ఆళ్లగడ్డలో టీడీపీ నేతల ధోరణి.. వాళ్ల ముందున్న లక్ష్యాలు ఏమిటో స్పష్టమవుతోంది.

సాక్షి ప్రతినిధి కర్నూలు: వ్యక్తిగతమైన ఆర్థిక లావాదేవీలు, కుటుంబ వివాదాలు తమ వర్గాలకు రుద్ది, ఇది వ్యక్తిగతంగా తమ మధ్య ఉన్న విభేదాలుగా కాకుండా, వర్గాల మధ్య విభేదాలుగా చూపి రాజకీయం చేయడం టీడీపీ నేతలకే చెల్లింది. పొరపాటున టీడీపీకి అధికారం ఇస్తే 'ఫ్యాక్షన్' రాజకీయాలు చేస్తామని భూమా నాగిరెడ్డి వారసుడు విఖ్యాత్‌రెడ్డి.. లోకేశ్ సమక్షంలోనే తెగేసి చెప్పడం చర్చనీయాంశంగా మారింది. కనీసం ఇలాంటివి తప్పని కూడా వారించే ప్రయత్నం లోకేశ్ చేయకపోవడం ఆయన రాజకీయ పరిణతి ఏపాటిదో తెలియజేస్తోంది. దీంతో నిజంగానే వీరికి అధికారం ఇస్తే మళ్లీ ఫ్యాక్షన్ తగాదాలతో ఆళ్లగడ్డ, నంద్యాలలో రక్తం పారే ప్రమాదం లేకపోలేదని ప్రజల్లో భయాందోళన నెలకొంది. వైఎస్సార్‌సీపీ కండువాతో గెలిచిన అఖిల, నాగిరెడ్డి 'పచ్చ'కండువావేసుకుని 'సైకిల్' జెర్సీ చేశారు. 2019 ఎన్నికలకు ముందే నాగిరెడ్డి చనిపోయారు. ఈ ఎన్నికల్లో అఖిల ఓడిపోయారు. ఆళ్లగడ్డ, నంద్యాల ఎమ్మెల్యేలుగా కొత్తతరం రాజకీయనేతలు గంగుల బిజేంద్రారెడ్డి, శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి ఎన్నికయ్యారు. నాలుగేళ్లలో అభివృద్ధి మినహా వీరికి మరో ఆలోచన లేదు. ఈ క్రమంలో టీడీపీ నేతలకు ఏమాత్రం అవకాశం ఇచ్చినా రెండు నియోజకవర్గాల్లో మళ్లీ అరాచక పాలన మొదలవుతుందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

అఖిల వ్యవహారంతో కుటుంబ సభ్యులు దూరం

నాగిరెడ్డి మృతి తర్వాత విభేదాల నేపథ్యంలో ఏవీ సుబ్బారెడ్డి దూరమయ్యాడు. చివరకు తనను చంపించేందుకు అఖిల సుఫారీ ఇచ్చినట్లు ఏవీ ఆరోపించారు. చింతకుంట, గోవిందపల్లికి చెందిన కొంతమందిని కడప పోలీసులు అప్పట్లో అదుపులోకి తీసుకున్నారు. ఏవీని దూరం చేసుకోవడం అఖిలకు దెబ్బే! 'భూమా'కు అత్యంత సన్నిహితుడైన శివరామిరెడ్డిని క్రషర్ విషయంలో దూరం చేసుకున్నారు. నాగిరెడ్డి చిన్నాన్న, విజయ డెయిరీ చైర్మన్‌గా కొనసాగిన భూమా నారాయణరెడ్డిని ఆ కుర్చీ నుంచి తప్పించే ప్రయత్నం చేయడంతో ఆయన కూడా దూరమయ్యారు. ఆపై అఖిల పెద్దనాన్న భాస్కర్‌రెడ్డి కుమారుడు భూమా కిషోర్‌రెడ్డితో విభేదాలు పెంచుకున్నారు. దీంతో అతను బీజేపీలో చేరారు. నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి సోదరుడు మహేశ్ కూడా బీజేపీ కండువా కప్పుకున్నారు. కిషోర్ పార్టీలో చేరిన తర్వాత తన ఇంటికి వెళ్లకుండా కిషోర్ నివాసానికి అఖిల తాళాలు వేయించారు. చివరకు బ్రహ్మానందరెడ్డికి, అఖిలకు కూడా మాటల్లేవు. ఇలా ఒక్కొక్కరుగా 'భూమా' బంధువులు పూర్తిగా అఖిలకు దూరమయ్యారు. ఈ పరిణామాలతో ఆళ్లగడ్డ, నంద్యాలలోని 'భూమా' వర్గం కూడా రాజకీయంగా ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తున్నారు. దీంతో ఆళ్లగడ్డకు అఖిల వచ్చినా కనీసం పదిమంది ఇంటికి రాని పరిస్థితి. ఈ కారణంగానే ఆమె జిల్లాకు రావడం వదిలేసి ఎక్కువగా హైదరాబాద్‌లోనే ఉంటోందనే చర్చ ఉంది. అయితే అక్కడ కూడా వివాదాల్లో తలదూర్చారు. శేరిలింగంపల్లిలో 40 ఎకరాల భూమి ఆక్రమించుకునేందుకు కేసీఆర్ బంధువులను కిడ్నాప్ చేసిన వ్యవహారంలో అఖిల 14రోజుల రిమాండ్‌లో ఉన్నారు. చంచల్‌గూడకు 'సీమ'లో బహుశా, రాష్ట్ర రాజకీయాల్లో కిడ్నాప్ వ్యవహారంలో మాజీ మహిళా మంత్రి జైలుకు వెళ్లడం ఇదే ప్రథమం.

'ఫ్యాక్షన్' భూమిలో అభివృద్ధి వెలుగులు

ఆళ్లగడ్డ మూడు దశాబ్దాలపాటు 'భూమా' ఏలుబడిలోనే ఉంది. ఇన్నేళ్లలో సాధించిందేమిటని ఆరాతీస్తే హత్యలు, కేసులు, వారిని నమ్ముకున్న కుటుంబాలు ఫ్యాక్షన్ లో రాలిపోవడం మాత్రమే. నాగిరెడ్డి వల్ల నాపై 24కేసులు ఉన్నాయని, ఫ్యాక్షన్ నడిపానని ఏవీ సుబ్బారెడ్డే స్వయంగా చెబుతున్నారు. ఇదేదో వారు సాధించిన ఘనకార్యంలా చెప్పుకుంటున్నారు. గంగుల బిజేంద్రారెడ్డి ఎమ్మెల్యే అయ్యాక డిగ్రీ కాలేజీ సాధించి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఇచ్చారు. 30 పడకల ఆస్పత్రి 50 పడకలకు పెంచి పేదల ఆరోగ్యానికి దన్నుగా నిలిచారు. చాగలమర్రి మండలం వనిపెంట చెంచుగూడెం లాంటి చీకటి తండాలకు వంతెనలను నిర్మించి బయటి ప్రపంచానికి వారిని తీసుకొచ్చారు. ఇలా ప్రతి ఆలోచనలో అభివృద్ధి మినహా మరో ఆలోచన లేని నాయకుడిగా ఎదుగుతున్నారు. అలాగే శిల్పా రవి హయాంలో నంద్యాల జిల్లా కేంద్రమైంది. మెడికల్ కాలేజీ సాధించారు. 'అమృత్' ద్వారా రూ.9కోట్లతో వెలుగోడు నుంచి తాగునీటిని నంద్యాలకు రప్పించి దాహార్తి తీర్చే ప్రయత్నం చేశారు. నగరంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా మూడు వంతెనలు నిర్మించారు. ఇలా వీరు అభివృద్ధి వైపు వెళుతున్నారు. కానీ టీడీపీ నేతలు గెలిస్తే చంపుతాం, నరుకుతాం అంటూ రక్తచరిత్రను గుర్తు చేస్తూ ప్రశాంత గ్రామాల్లో అలజడి సృష్టిస్తున్నారు.

'జగనన్నకు చెబుదాం'తో మెరుగైన సేవలు

- జిల్లా స్పెషల్ ఆఫీసర్, రవాణా, రోడ్లు భవనాల శాఖ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న



వెల్దుర్తి ఆర్బీకేలో క్లియోస్క్ పనితీరు పరిశీలిస్తున్న పీఎస్ ప్రద్యుమ్న

వెల్దుర్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతున్నట్లు జిల్లా ప్రత్యేక అధికారి, రవాణా, రోడ్లు, భవనాల శాఖ సెక్రటరి పీఎస్ ప్రద్యుమ్న తెలిపారు. శనివారం ఆయన వెల్దుర్తి రైతు భరోసా కేంద్రం-1, అంగన్‌వాడీ-8 లను తనిఖీ చేశారు. ఆర్బీకేలో క్లియోస్క్ యంత్రం పనితీరును పరిశీలించారు. రైతులకందుతున్న పథకాల గురించి ఆరా తీశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకుని పిల్లలతో ముచ్చటించారు. గుడ్డు సైజు తగ్గడంపై, కేంద్రానికి టాయ్‌లెట్లు, కాంపౌండ్ లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధిపై పకడ్బందీ పర్యవేక్షణ ఉందని తెలిపారు. వెల్దుర్తిలో ప్రధాన రహదారుల ఆక్రమణలు, రహదారి విస్తరణపై నివేదిక అందించాలని ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజును ఆదేశించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఎస్ఎస్ఏ పీఓ వేణుగోపాల్, ఐసీడీఎస్ పీడీ ఉమా మహేశ్వరి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు



క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

మంత్రాలయం: వేసవి సెలవులు ముగుస్తున్న నేపథ్యంలో శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో మంత్రాలయానికి వస్తున్నారు. శనివారం భక్తులతో శ్రీ మఠం కిక్కిరిసింది. పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి మూలబృందావనానికి నిర్మల్య విసర్జన, ఫల, పుష్ప,పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మూలరాముల పూజల్లో పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేపట్టారు. మూలబృందావనాన్ని కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి తీసుకొచ్చిన ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. రాత్రి ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు, నవరత్న రథంపై ఉంచి శ్రీ మఠం మాఢ వీధుల్లో ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా తుంగభద్ర నదిలో పుణ్య స్నానమాచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రసాదం పంపిణీ

కౌతాళం: జగద్గురు ఖాదర్‌లింగ స్వామి ఉరుసులో భాగంగా శనివారం ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా ఉసేని చిష్తీ ఇంట్లో మట్టి కుండల్లో ప్రత్యేంగా తయారు చేసిన తీపి పదర్థాన్ని డప్పువాయిద్యాలు, బ్యాండుమేళాల మధ్య దర్గాకు తీసుకొచ్చారు. ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనల అనంతరం ధర్మకర్త ప్రసాదాన్ని ముగ్గురు భక్తులకు పంపిణీ చేశారు. ఈ ప్రసాదం కోసం భక్తులు ఎగబడ్డారు. దీనిని పొలంలో పాతితే పంట బాగా పండుతుందని, రోగం ఉన్నవారు తింటే స్వస్థత చేకూరుతుందని భక్తుల నమ్మకం.



ప్రసాదం కోసం ఎగబడుతున్న భక్తులు

గురుబోధ

గురుబోధను స్వీకరించి శనివారం చాలామంది ఖాదర్‌లింగ స్వామి శిష్యులుగా మారారు. శిష్యులుగా మారిన తర్వాత వారు మంచి మార్గంలో నడుస్తూ ఐదుపూటలా నమాజు చేయాల్సి ఉందని ధర్మకర్త మున్నపాషా తెలిపారు.

రైతుల ఇంట ఏరువాక వెన్నెల!

- నేడు ఏరువాక పౌర్ణమి
- వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టనున్న అన్నదాతలు



ఎమ్మిగనూరు మండలం గుడేకల్‌లో ఎద్దుల పార్వేట

కర్నూలు(అగ్రికల్చర్)/మంత్రాలయం: కల్లాకపటం కానని వాడ.. లోకం పోకడ తెలియని వాడా... ఏరువాక సాగారో రన్నోచిన్నన్న అంటూ ' సినీకవి రాసిన పాట అన్నదాతలకు చక్కగా సరిపోతుంది. 'రోజులు మారాయి' చిత్రంలోని ఈ పాట వింటే వ్యవసాయానికి ఎంతటి ప్రాధాన్యత ఉందో ఇట్టే తెలిసిపోతుంది. ఏరువాకకు అన్నదాతలకు అవినాభావ సంబంధం ఉంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ పండుగను పెద్ద ఎత్తున జరుపుకుంటారు. ఏరువాక పౌర్ణమిని జేష్ఠ పౌర్ణమిగా కూడా వ్యవహరిస్తారు. ఈ నెల 4వ తేదీ ఆదివారం ఏరువాక పౌర్ణమి జరుపుకోవడానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసుకున్నారు.

వేడుకగా ..

పొలాల్లో సేద్యం పనులు మొదలు పెట్టే వేడుకను ఏరువాక పౌర్ణమిగా వ్యవహరిస్తారు. ఈ సారి ముందస్తుగా వర్షాలు పడటం, ప్రభుత్వం నుంచి వ్యవసాయానికి చేయూత లభించడంతో రైతన్నలు పండుగను ఉత్సాహంగా నిర్వహించనున్నారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా వేడుకలను నిర్వహిస్తారు. ఎద్దులకు ప్రత్యేకంగా అలంకరించి.. కాడి కట్టి పొలాలకు ఊరేగింపుగా వెళ్లి దుక్కి దున్నడాన్ని ప్రారంభిస్తారు. దేవనకొండ, ఆస్పరి తదితర మండలాల్లో ఎద్దులకు పరుగుపందేలు నిర్వహిస్తారు. పందేల్లో గెలిచిన ఎద్దులకు ఊరేగింపులు నిర్వహిస్తారు. గెలిచిన ఎద్దులకు ధాన్యం పెట్టి అవి తినగా మిగిలిన వాటిని విత్తనాల్లో కలుపుకుంటారు. ఇలా చేయడం వల్ల పంట బాగా వస్తుందనే నమ్మకం రైతుల్లో ఉంది. కొన్ని గ్రామాల్లో ఎద్దులతో పారువేట నిర్వహిస్తారు. ఏరువాక పౌర్ణమి రోజున రైతులు పిండి వంటలు చేసుకుంటారు. బెల్లం, బియ్యం, ఆవుపాలతో పులగం వండి పశువులకు నైవేద్యంగా పెడుతారు.

రైతుకు మంచి కాలం

నాలుగేళ్లుగా వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. పంటలు బాగా పండుతున్నాయి. మద్దతు ధరలు లభిస్తున్నాయి. రైతుకు మంచి కాలం నడుస్తోంది. ప్రభుత్వం కూడా వ్యవసాయానికి అన్ని రకాల చేయూత అందిస్తోంది. ఏరువాక పండుగను ఘనంగా జరుపుకుంటాం.
– హనుమంతు, పెద్దభూంపల్లి, కోసిగి మండలం

మద్దిలేటయ్యకు రికార్డు స్థాయిలో ఆదాయం

- వివిధ సేవల ద్వారా ఒకే రోజు రూ. 21.23 లక్షలు

బేతంచెర్ల: శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయానికి శనివారం రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చింది. జ్యేష్ఠ మాసం శుభ దినాలు, వేసవి సెలవుల సందర్భంగా జిల్లా నలుమూలలనుండే కాకుండా, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించారు. కాగా సేవా టికెట్స్, లడ్డూప్రసాదాలు, గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండాదీపం, విరాళాలు, కళ్యాణ కట్ట తదితర సేవల ద్వారా రూ. 21,23,213 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, ఆలయ చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు. ఒకే రోజు ఆలయంలో స్వామి వారి సేవల ద్వారా రూ. 21 లక్షలకు పైగా ఆదాయం రావడం ఇదే మొదటిసారని ఆలయ వర్గాలు చెబుతున్నాయి. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు లక్ష్మణ్ నాయుడు, రామచంద్రుడు, హనుమంత్ రెడ్డి, ఆకుల రమణ, మద్దయ్య, క్రిష్టారెడ్డి, వెంగళరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుంగిన గోరుకల్లు కట్ట



రిజర్వాయర్ లోపలి భాగంలో కుంగిన దృశ్యం

పాణ్యం: గోరుకల్లు రిజర్వాయర్ లోపలి భాగం స్వల్పంగా కుంగినట్లు ఈఈ సుభకుమార్ శనివారం తెలిపారు. విషయాన్ని సీఈ కబీర్‌బాషా దృష్టికి తీసుకెళ్లామన్నారు. సోమవారం నుంచి మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. పనులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో అధికారులతో సమీక్ష నిర్వహించామన్నారు. ప్రస్తుతం కుంగిన కట్ట వలన ఎలాంటి ప్రమాదం లేదని, తక్షణమే మరమ్మతుల చర్యలు చేపడుతున్నామన్నారు.

శ్రీమఠం పీఠాధిపతి బెంగళూరు పర్యటన

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థులు మూడు రోజుల పాటు బెంగళూరు నగరంలో పర్యటించనున్నారు. శనివారం బయలుదేరి మూడు రోజుల పాటు బెంగళూరులో జరిగే పూజా కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి మంగళవారం రాత్రికి మంత్రాలయం చేరుకుంటారని శ్రీ మఠం అధికారులు ఓ ప్రకటనలో వెల్లడించారు.

వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల షెడ్యూల్ విడుదల

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగుల బదిలీలకు సంబంధించి షెడ్యూల్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య శనివారం విడుదల చేశారు. ఈ నెల 5న ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగుల జాబితా ప్రదర్శించనున్నారు. 5, 6వ తేదీల్లో అభ్యంతరాలు స్వీకరించనున్నారు. 10వ తేదీ వరకు బదిలీలకు దరఖాస్తుకు స్వీకరించి, 13వ తేదీ బదిలీకి అర్హులైన వారి జాబితా ప్రదర్శించనున్నారు. దీనిపై 14వ తేదీన అభ్యంతరాల స్వీకరణ, 17న లాస్ట్‌గ్రేడ్ సర్వీస్ ఉద్యోగులకు, 19న ఇతర ఉద్యోగులకు బదిలీ కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు.

కేజీబీవీలకు తీపి కబురు

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 202 ఖాళీల భర్తీకి నోటిఫికేషన్
- మెరిట్ ప్రాతిపాదికన నియామకాలు
- దరఖాస్తుకు రేపటి వరకు గడువు
- ఈ నెల 14 నాటికి ఎంపిక ప్రక్రియ పూర్తి



కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం

కర్నూలు సిటీ/ఆళ్లగడ్డ: కార్పొరేట్‌కు దీటైన వసతులు.. అత్యుత్తమమైన విద్యా ప్రమాణాలు.. ఇంగ్లిష్ మీడియంలో బోధన.. అనాథలైన, ఆర్థికంగా వెనుకబడిన, బడిమానేసిన, బడిబయట బాలికలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో దివంగత నేత డాక్టర్ వైఎస్‌రాజశేఖర్ రెడ్డి హయంలో కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలను ప్రారంభించారు. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయిన తరువాత మరో ముందడుగు వేసి పదో తరగతి వరకు ఉన్న కేజీబీవీల్లో ఇంటర్మీడియట్ విద్యను ప్రవేశపెట్టారు. ఇప్పుడు ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసి కేజీబీవీలకు తీపి కబురు అందించారు.

13న నియామాక పత్రాల జారీ

ఉమ్మడి జిల్లాలో 53 కస్తూర్బా గాంధీ విద్యాలయాలు ఉన్నాయి. వీటిలో 202 పోస్టులను భర్తీ చేయనున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా పోస్టులను భర్తీ చేయనున్న రెండో జిల్లాగా ఉమ్మడి కర్నూలు నిలిచింది. ప్రిన్సిపాల్ 15, సీఆర్‌టీ 52, పీజీటీ 130, పీఈటీ 5 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిపై భర్తీ చేయనున్నారు. ఈ నెల 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. 6, 7 తేదీల్లో పోస్టుల వారీగా వచ్చిన దరఖాస్తుల్లో మెరిట్ ప్రకారం ఒక పోస్టుకు ముగ్గురిని ఎంపిక చేయనున్నారు. ఎంపికైన వారికి 8, 9 తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది. అనంతరం 10, 11, 12 తేదీల్లో నైపుణ్య పరీక్ష, పర్సనాలిటీ పరీక్ష నిర్వహించి, 12వ తేదీన తుది జాబితాను ప్రకటిస్తారు. ఉద్యోగాలు పొందిన వారికి 13న నియామక పత్రాలను జారీ చేయనున్నారు. ఈ పత్రాలను అందుకున్న వారు 14వ తేదీన విధుల్లో చేరాల్సి ఉంటుంది.

మెరిట్ ప్రకారమే పోస్టుల భర్తీ

కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ప్రిన్సిపాల్, సీఆర్‌టీ, పీజీటీ, పీఈటీ పోస్టులను కేవలం మెరిట్ ప్రకారమే భర్తీ చేయనున్నారు. జిల్లా స్థాయి ఎంపికకు జేసీ చైర్మన్‌గాను, ఉమ్మడి జిల్లా కేంద్ర సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ మెంబర్ కన్వీనర్‌గాను, డీఈఓ, జీసీడీఓ, ఓ సబ్జెక్టు నిపుణులు సభ్యులుగా ఉంటారు. ప్రతి పోస్టుకు 100 మార్కులు ఉంటాయి. ప్రిన్సిపాల్/పీజీటీ పోస్టులకు పదో తరగతిలో పది, ఇంటర్‌లో పది, డిగ్రీలో పది, పీజీలో వచ్చిన మార్కులకు 30 మార్కులు కేటాయిస్తారు. కేజీబీవీల్లో పని చేసే, చేసిన వారికి ఏడాదికి అర మార్కు, 10 ఏళ్ళు చేసి ఉంటే 8 మార్కులు వెయిటేజ్ ఇస్తారు. నైపుణ్య పరీక్షలో కమ్యూనికేషన్ సామర్థ్యాలు, డెమో, నమూనా పాఠ్య బోధనలకు 15 మార్కులు ఉంటాయి. సీఆర్‌టీ పోస్టులకు సైతం టెన్త్‌లోని మార్కులకు 10, ఇంటర్‌లో పది, డిగ్రీలో 32 మార్కులు, పీజీ 10 మార్కులు, బీఈడీలో 15 మార్కులు కేటాయిస్తారు. కేజీబీవీల్లో ఏడాది పని చేస్తే అర మార్కు, పదేళ్లు చేసింటే 8 మార్కులు, నైపుణ్య పరీక్షలో కమ్యూనికేషన్ సామర్థ్యాలు, డెమో, నమూనా పాఠ్య బోధనలకు 15 మార్కులు ఉంటాయి. పీఈటీ పోస్టులకు టెన్త్ మార్కులకు పది, ఇంటర్‌కు 20 మార్కులు, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో యూజీడీ మార్కులకు 32, బీపీఈడీకి 10, ఎంపీఈడీకి 5 మార్కులు కేటాయిస్తారు. కేజీబీవీల్లో పని చేసే, చేసిన వారికి ఏడాదికి అర మార్కు, 10 ఏళ్లు చేసి ఉంటే 8 మార్కులు వెయిటేజ్ ఇస్తారు. నైపుణ్య పరీక్షలో కమ్యూనికేషన్ సామర్థ్యాలు, డెమో, నమూనా పాఠ్య బోధనలకు 15 మార్కులు కేటాయిస్తారు.

దరఖాస్తులు ఇలా..

పోస్టులన్నీ మహిళా అభ్యర్థులతోనే భర్తీ చేయనున్నారు. apkgbv.apcfss.in అనే వెబ్‌సైట్ ద్వారా రూ. 100 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఓపెన్ కేటగిరీ అభ్యర్థుల వయస్సు 18 నుంచి 42 సంవత్సరాల మధ్య ఉండాలి, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 5 ఏళ్లు, మాజీ సైనిక ఉద్యోగులకు 3 ఏళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్ల వయోపరిమితి సడలింపు ఉంటుంది.

దళారులను నమ్మొద్దు



ఈ నెల 14వ తేదీ లోపు ఎంపిక ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పోస్టుల భర్తీ పారదర్శకంగా జరుగుతుంది. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం మెరిట్ కమ్ రోస్టర్ ప్రాతిపదికనే ఎంపికలుంటాయి. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు. ఎవరైన డబ్బులిస్తే ఉద్యోగం ఇప్పిస్తామని చెబితే వెంటనే మా దృష్టికి తీసుకురావాలి.

– అనురాధ, నంద్యాల జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో – ఆర్డినేటర్

జెడ్పీలో 108 మంది ఉద్యోగుల బదిలీ

- సాధారణ బదిలీల్లో 9 మంది ఎంపీడీఓలకు స్థానచలనం
- కొత్తగా పదోన్నతి పొందిన 12 మందికి ఎంపీడీఓలుగా పోస్టింగులు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు జిల్లాపరిషత్ యాజమాన్య పరిధిలో 108 మంది ఉద్యోగులను బదిలీ చేసినట్లు జిల్లాపరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆధ్వర్యంలో ఈ బదిలీల ప్రక్రియను పూర్తి చేశామన్నారు. బదిలీ అయిన వారిలో ఎంపీడీఓలు 9, ఏఓ 12, సీనియర్ అసిస్టెంట్లు 13, జూనియర్ అసిస్టెంట్లు 24, టైపిస్టులు 9 మంది ఉన్నారు. అలాగే రికార్డు అసిస్టెంట్లు 14, ల్యాబ్ అసిస్టెంట్లు 12, లైబ్రరీ అసిస్టెంట్లు 11, ఆఫీస్ సబార్డినేట్లు నలుగురు ఉన్నారని తెలిపారు. వీరంతా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ పంచాయతీరాజ్ సంస్థలు, జిల్లాపరిషత్ హైస్కూల్స్, ఎంపీడీఓ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. అలాగే ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన ఈఓ ఆర్‌డీ, ఏఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పించిందని సీఈఓ తెలిపారు. పదోన్నతి పొందిన వారిలో 12 మందిని కర్నూలు జిల్లాకు కేటాయించారని, వీరందరికీ పోస్టింగులు ఇచ్చామన్నారు.

పదోన్నతి పొందిన ఎంపీడీఓ	పోస్టింగ్ ఇచ్చిన మండలం
కె.విశ్వమోహన్	కృష్ణగిరి
పి.దశరథ రామయ్య	నందవరం
సి.వి.కొండయ్య	చిప్పగిరి
జి.వి.సుబ్బరాజు	కౌతాళం
కె.సావిత్రి	హొళగుంద
ఎం.మణిమంజరి	మంత్రాలయం
సి.శివమల్లేశ్వరప్ప	వెల్దుర్తి
ఎన్.కవిత	పత్తికొండ
ఎ.శ్రీనివాసరావు	గడివేముల
జి.వెంకటేశ్వరరెడ్డి	అవుకు
డి.గోపీకృష్ణ	పాములపాడు
జి.మోహన్ కుమార్	ఆత్మకూరు

ఎంపీడీఓల బదిలీలు ఇలా..

ఎంపీడీఓ పేరు	పనిచేస్తున్న మండలం	బదిలీ అయిన మండలం
ఎస్.సుగుణశ్రీ	గోస్పాడు	నంద్యాల
జి.భాస్కర్	నంద్యాల	గోస్పాడు
ఎం.డి.మహబూబ్ దౌలా	కోవెలకుంట్ల	వాగలమర్రి
కె.ఎ.అజాం ఖాన్	అవుకు	కర్నూలు
సి.వెంగన్న	ఆత్మకూరు	బేతంచర్ల
ఎ.అశ్విని కుమార్	బేతంచర్ల	బనగానపల్లె
పి.వి.సుబ్బారెడ్డి	ఆళ్లగడ్డ	దొర్నిపాడు
ఎం.రాణెమ్మ	ఆన్ లీవ్	ఆస్పరి
పి.మహబూబ్ ఖాన్	ఆన్ లీవ్	ఆళ్లగడ్డ

టీడీపీ నాయకుడి మద్యం దందా!



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం బాక్సులను చూపుతున్న సెబ్ పోలీసులు

ప్యాపిలి: టీడీపీ నాయకుడు అభిషేక్‌రెడ్డి మద్యం దందా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ప్యాపిలి మండలం వెంగళాంపల్లె గ్రామంలో వెంకటేశ్వర్లు అనే వ్యక్తి కల్లందొడ్డిలో నిల్వ ఉంచిన 96 టెట్రా ప్యాకెట్లు ఉండే 8 బాక్సులను సెబ్ పోలీసులు శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు వెంకటేశ్వర్లకు ప్యాపిలి పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు అభిషేక్‌రెడ్డి కర్ణాటక మద్యాన్ని విక్రయించినట్లు విచారణలో వెల్లడైందని సెబ్ సీఐ భీమలింగం తెలిపారు. వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు. టీడీపీ నాయకుడు అభిషేక్ రెడ్డి గతంలో రెండు సార్లు అక్రమ మద్యం కేసులో పట్టుబడ్డారు. అతని కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

వేళాంగిణి మాత దర్శనానికి 9న ప్రత్యేక బస్సు

కర్నూలు(రాజ్‌విహార్): తమిళనాడులోని వేళాంగిణి మాత దర్శనం కోసం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు నడపనున్నట్లు కర్నూలు–2డిపో మేనేజరు సర్దార్ హుసేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9వ తేదీ శుక్రవారం రాత్రి 8 గంటలకు కర్నూలు కొత్త బస్టాండ్ నుంచి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం నాగపట్నం చేరుకుంటుందని, సాయంత్రం అక్కడి నుంచి బయలుదేరి రాత్రి వేళాంగిణి చేరకుంటుందని పేర్కొన్నారు. 11వ తేదీ సాయంత్రం 4గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 12వ తేదీన ఉదయం 10గంటకు కర్నూలు చేరుకుంటుందని తెలిపారు. ఈ బస్సులో రానుపోను చార్జీ పెద్దలకు రూ.3 వేలు, పిల్లలకు రూ.2 వేలు ఉంటుందని పేర్కొన్నారు.

చంద్రబాబుని ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదు

- డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

శ్రీశైలం టెంపుల్: చంద్రబాబు ఎన్ని మోసపూరిత హామీలు ఇచ్చినా, ఆల్ ఫ్రీ అని చెప్పినా ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని ఏపీ డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శనివారం శ్రీశైలం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకున్న అనంతరం ఆలయం వెలుపల మంత్రి మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి ఇచ్చిన హామీలన్నింటినీ దాదాపుగా పూర్తి చేశారన్నారు. అయితే చంద్రబాబుకు మాత్రం ఆ పార్టీ మేనిఫెస్టో చిత్తు కాగితంతో సమానం అన్నారు. 2014లో 650 హామీలను ఇచ్చి, ఎన్నికల్లో గెలిచిన తరువాత మేనిఫెస్టోని వైబ్‌సైట్ నుంచి తొలగించిన ఘనత టీడీపీదని విమర్శించారు. వైఎస్ జగన్ ప్రజలకు సంక్షేమ పథకలు అందిస్తుంటే.. చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు ఏపీని అప్పుల పాలు చేస్తున్నారని విమర్శించడం సిగ్గుచేటన్నారు.



మల్లన్న దర్శనానికి వెళ్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

కార్తీక మాసంలో 'మహాకుంభాభిషేకం'

శ్రీశైల మహాక్షేత్రంలో మహాకుంభాభిషేకాన్ని శివునికి ప్రీతికరమైన కార్తీకమాసంలో నిర్వహిస్తామని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. శ్రీశైల మహాక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం అధునాతన సౌకర్యాలతో క్యూ కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపడతామన్నారు. ప్రధానాలయానికి ఎదురుగా ఉన్న మాడ వీధులను భక్తుల సౌకర్యార్థం విశాలంగా, సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు.

నకిలీ సర్వే నంబర్‌తో పాస్ పుస్తకాలు

- 11 మంది నిందితులపై కేసు నమోదు

చాగలమర్రి: నకిలీ సర్వే నంబర్‌తో పాస్ పుస్తకాలు పుట్టించి, రికార్డుల్లో లేని భూమిని ఇతరులకు విక్రయించి మోసం చేసిన ఘటన చాగలమర్రి పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి ఓ కొలిక్కి తెచ్చినట్లు తెలుస్తోంది. 11 మందిపై కేసు నమోదు చేయగా, అందులో ఇద్దరు రెవెన్యూ ఉద్యోగులు ఉన్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. శెట్టివీడు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 3/1 లో సుమారు 29 ఎకరాల విస్తీర్ణంలో రైతులకు చెందిన పట్టా భూమి ఉంది. ఆ భూమిలో సొంత పట్టాదారు రైతులు అనుభవంలో ఉన్నారు. అయితే 2018లో ఆళ్లగడ్డ మండలం పేరాయిపల్లె గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తుల పేర్లతో అప్పట్లో శెట్టివీడు వీఆర్ఓ, కంప్యూటర్ ఆపరేటర్ కలిసి అదే భూమికి 3/1ఏ అను నకిలీ సర్వే నెంబరుపై అప్పటి తహసీల్దారు డిజిటల్ సంతకంతో పాసుపుస్తకాలను సృష్టించారు. ఆ తర్వాత సర్వే నెంబరుపై పొందిన పట్టాదారు పాసు పుస్తకం పొందారు. ఆ భూమిని ఇతరులకు కొంత మొత్తానికి అమ్మినట్లు తెలిసింది. అయితే ఈ సర్వే నెంబరుతో శెట్టివీడు రెవెన్యూలో భూమి లేదని తెలుసుకుని కొనుగోలుదారుడు తాను మోసపోయినట్లు గుర్తించాడు. వెంటనే చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడ పట్టించుకోకపోవడంతో బాధితుడు ఆళ్లగడ్డ డీఎస్పీని ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆళ్లగడ్డ సీఐ రాజశేఖర్‌రెడ్డి చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని పూర్తి స్థాయిలో విచారిస్తున్నట్లు సమాచారం.